పుష్కర కాలమైనా పనులు పూర్తికావా?

కొమురవెల్లి మండలంలో అర్ధాంతరంగా ఆగిన పంచాయతీ భవన నిర్మాణాలు 6

ఊరంటే.. ఊరుకాదు

నగరాన్ని తలపించే లగ్జరీ విలేజెస్

విలాసవంతమైన భవనాలు.. అందమైన రోడ్లు.. మౌలిక సదుపాయాలూ అదుర్స్

పచ్చదనం-పరిశుభ్రతలోనూ మేటి... అన్నింటా ఆదర్శం రామిరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం



పట్టణాన్ని తలపించేలా స్లాబ్ ఇళ్లతో రామిరెడ్డి బావి గ్రామం

5లో

కలెక్టర్ హైమావతి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరిస్తున్న హైమావతి

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన కె.హైమావతి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె ఉదయం కలెక్టరేట్‌కు చేరుకోగా అదనపు కలెక్టర్‌లో గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో హైమావతి వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మినీ కాన్ఫరెన్స్‌హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల జిల్లా అధికారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళుతున్న పూర్వ కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వారానికోసారి వస్తా..

● మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సిద్దిపేట/గజ్వేల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి వారానికోసారి సిద్దిపేటకు వస్తానని, నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రిగా పదవి చేపట్టిన తర్వాత మొదటిసారిగా చెన్నూరు నియోజకవర్గానికి వెళ్తున్న ఆయనకు శనివారం గజ్వేల్ రిమ్మనగూడ వద్ద డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో, సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. రంగధాంపల్లిలో అమరవీరుల స్తూపానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిద్దిపేటకు తమకు, తమ తండ్రి వెంకటస్వామికి అవినాభావ సంబంధం ఉందన్నారు. సిద్దిపేటను అభివృద్ధి చేసేందుకు తనకు మంచి అవకాశం లభించిందని చెప్పారు. సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దామన్నారు. నాయకులు విభేదాలు పక్కనబెట్టి కలిసి పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ధ్యేయంగా పనిచేయాలన్నారు. తనపై అభిమానంతో వచ్చిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో మంత్రి వివేక్‌కు స్వాగతం పలుకుతున్న డీసీసీ అధ్యక్షుడు

మెగా లోక్ అదాలత్‌లో 4,315 కేసులు పరిష్కారం



సిద్దిపేట కోర్టులో కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయాధికారులు

సిద్దిపేట క్రైం/హుస్నాబాద్/దుబ్బాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, అదనపు కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 4,315 కేసులు పరిష్కారమయ్యాయి. 4,274 క్రిమినల్ కేసులు, 32 సివిల్, 9 మోటార్ సైకిల్ ప్రమాద కేసులను పరిష్కరించి రూ.1,29,62,000 బాధితులకు అందజేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జరిగిన లోక్‌అదాలత్‌కు అదనపు జిల్లా, సెషన్ జడ్జి జయప్రసాద్ హాజరై మాట్లాడారు. చిన్నచిన్న కేసులకు కోర్టుల వెంట తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని కక్షిదారులకు సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోగలిగిన క్రిమినల్, రోడ్డు ప్రమాద, గృహహింస, చెక్‌బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సంతోష్ కుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ కోర్టులో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌కు హుస్నాబాద్ మెజిస్ట్రేట్ బి.రేవతి అధ్యక్షత వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో 213, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 142 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. దుబ్బాక కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌కు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జితేందర్ హాజరుకాగా, 398 కేసుల్లో రాజీ కుదిర్చారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

మునిపల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): 2025లో కొత్తగా పట్టా పాసుపుస్తకాలు వచ్చిన రైతులందరూ రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనితారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులందరూ గమనించి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

యథేచ్ఛగా నీటి దందా

●గ్రామాల రహదారులు ధ్వంసం ● ఇష్టారీతిలో అనుమతి లేని వాటర్ ప్లాంట్లు ●అడుగంటుతున్న భూగర్భ జలాలు



పొలాల నుంచి నీటిని దండుకుంటున్న ట్యాంకరు



ఇంద్రకరణ్ శివారులో ధ్వంసమైన రహదారి

కంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అక్రమ నీటి దందాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. నిబంధనలు తుంగలో తొక్కి నీటి దళారులు ఇష్టారీతిలో మండలంలోని ఇంద్రకరణ్, కవలంపేట, కంది, చిమ్నాపూర్, జుల్‌కల్, చేర్యాల, ఎర్దనూర్ గ్రామాల్లో అనుమతి లేని వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని పరిశ్రమలకు తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారుల కళ్లముందే రోజూ లక్షల లీటర్ల నీటిని ట్యాంకర్ల కొద్ది తోడుకెళ్తున్నా అడిగే వారు కరువయ్యారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నా ప్రశించేవారు లేరు. కారణం నీటి దళారులకు ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి.

పడిపోతున్న నీటి నిల్వలు

అసలే కంది మండలంలో నీటి కొరత. దీనికి తోడు ఈ యేడు వర్షాలు కురవక చెరువులు , కుంటలు అడుగంటిపోయాయి. ఉన్న కాస్త నీటి వనరులతోనే ఇంటి అవసరాలు, పంటలకు, మూగ జీవాల తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. కంది, కాశీపూర్, కలివేముల, జుల్‌కల్, ఇంద్రకరణ్, చేర్యాల, కవలంపేట, చిమ్నాపూర్ తదితర గ్రామాల్లో కొద్దోగొప్పో నీటి వనరులు ఉన్నాయి. అయితే ఆ నీటి వనరులు ఉన్న చోట అక్రమార్కుల కన్ను పడింది. వెంటనే అక్కడి ప్రజాప్రతినిధులకు చెయ్యి తడిపి, వాటర్ ప్లాంట్లు నిర్మించుకుని మరి వ్యాపారం సాగిస్తున్నారు. ఒక్క ఇంద్రకరణ్ గ్రామంలోనే 50కి పైగా ట్యాంకర్లు రోజూ తిరుగుతున్నాయి. కవలంపేటలోని ఊదం చెరువు పక్కనే పచ్చని పంటపొలాల్లో అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి ట్యాంకర్‌లకొద్ది నీటిని తోడుకెళ్తున్నారు. అడపా దడపా అధికారులు ట్యాంకర్లను పట్టుకొచ్చి జరిమానా విధిస్తున్నా కూడా దళారులు ఎలాంటి జంకు లేకుడా వారి ఆదేశాలను లెక్క చేయకుండా మళ్లీ ఈ దందాను కొనసాగిస్తున్నారు.

రోడన్నీ ధ్వంసం

వాటర్ ట్యాంకర్ల రాకపోకల ద్వారా ఒత్తిడికి గురై గ్రామాల రోడ్లన్నీ నాశనం అవుతున్నాయి. మండపరిధిలోని చేర్యాల-ఇంద్రకరణ్ వెళ్లే దారిలో 3 కిలోమీటర్ల దూరం తారు రోడ్డంతా ధ్వంసం అయ్యింది. అంతేగాక ట్యాంకర్ల బరువుతో దారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వందల కొద్ది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్లన్నీ దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి దందాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పండగ వాతావరణంలో రైతు నేస్తం నిర్వహించాలి

●జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళిఘణపూర్/మెదక్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మైక్, వీడియో కాన్ఫరెన్స్ సిస్టం, రైతులకు సిట్టింగ్ కెపాసిటీ తదితర వివరాలను డీఏవో వినయ్‌ను అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం మెదక్ అర్బన్ ఔరంగాబాద్‌లో రేషన్ దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు.

జూదం ఆడుతున్న పలువురి అరెస్ట్

పాపన్నపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నాగ్సాన్‌పల్లి శివారులో జూదం ఆడుతున్న పలువురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నాగ్సాన్ పల్లి శివారులో పలువురు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్‌పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు చేయగా, జూదం ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 14,330 నగదు, 3 ఫోన్లు, స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించినట్లు చెప్పారు.

కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిరంకుశ పాలనకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం సిద్దిపేటలో పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రం మత కల్లోలాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. మారుతున్న రాజకీయ పరిస్థితులకు ప్రజలు విరక్తి చెంది పోరాటాల వైపు వస్తున్నారని, ఈ క్రమంలో కమ్యూనిస్టులను ఆదరిస్తున్నారన్నారు. జూలై 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భాస్కర్, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, గోపాలస్వామి, ఎల్లయ్య, సత్తిరెడ్డి, వెంకట్, కృష్ణారెడ్డి, యాదగిరి, రవికుమార్, బాలనర్సయ్య, శ్రీనివాస్, శారద, నవీన, శిరీష, ప్రశాంత్, కనకయ్య, రంగారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, శోభ, బాలమణి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధం

●డ్రైవర్ మృతి



ప్రమాదంలో దగ్ధమవుతున్న టిప్పర్

జిన్నారం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ వద్ద టిప్పర్‌కు మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి టిప్పర్ పూర్తిగా కలిపోగా.. డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన శనివారం జిన్నారం మండలం కాజీపల్లి శివారులో బిల్వానీ స్టోన్ క్రషర్ వద్ద జరిగింది. టిప్పర్ డ్రైవర్ రాంసుజన్ (38) వాహనం మరమ్మతులు చేస్తూ హైడ్రాలిక్‌తో టిప్పర్ ట్రాలీని పైకి లేపగా.. పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో డ్రైవర్‌కు షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. తర్వాత మంటలు చెలరేగి టిప్పర్ మొత్తం కాలిపోయింది. మృతి చెందిన డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు చెందిన వాడు కాగా.. ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి జీవిస్తున్నాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని సీఐ రవీందర్‌రెడ్డి సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

పటాన్‌చెరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాటి గ్రామ శివారులో జరిగింది. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అందించిన కథనం ప్రకారం ఒడిశా రాష్ట్రం, కహలాడి జిల్లా, జామపాడ గ్రామానికి చెందిన దినేష్ బోయి (22) కొంతకాలంగా పాటిలో ఉంటూ డైమండ్ బ్రిక్స్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా ప్లాంట్‌లో మిక్సర్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బీడీఎల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గృహిణి దుర్మరణం

● భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలు

పటాన్‌చెరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై స్కూటీపై వెళ్తున్న కుటుంబాన్ని వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో గృహిణి దుర్మరణం పాలవగా, భర్త ఇద్దరు పిల్లలు గాయాలపాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం పటాన్‌చెరు పట్టణ శివారులో చోటు చేసుకుంది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నివాసం ఉండే ఎన్కపల్లి పవన్ ఆయన భార్య శ్రావణి (34), కుమార్తెలు దీపస్వి (7), యశస్వి (5)లతో కలిసి స్కూటీపై పటాన్‌చెరు పట్టణ శివారులోని వ్యాల్యూజోన్ సూపర్‌మార్కెట్‌కు వెళ్లేందుకు మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరారు. ఔటర్ రింగ్‌రోడ్డు బ్రిడ్జి రోడ్డు వద్ద వెనకనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు (ఏపీ 28 టీఈ 4099) వారు ప్రయాణిస్తున్న స్కూటీని వెనక నుంచి ఢీకొంది. దీంతో స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయారు. శ్రావణి బస్సు చక్రాల కింద పడటంతో తలపైనుంచి వెళ్లిపోయి అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. భర్త పవన్ కుమార్తెలు స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అద్దె ఇంట్లో గుర్తుతెలియని శవం

పటాన్‌చెరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అద్దెకు ఉంటున్న ఇంట్లో గుర్తుతెలియని యువకుడి శవం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఇస్నాపూర్‌లోని దీక్షిత్ ఆసుపత్రి వెనకాల ఉన్న పేరిసెట్టిసాయి కృష్ణ అనే వ్యక్తికి చెందిన భవనం రెండో అంతస్తులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిన దశలో లభ్యమైంది. గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. గదిని అద్దెకు తీసుకున్న కొందరు వ్యక్తులు గుర్తుతెలియని 30ఏళ్ల యువకుడిని పదునైన ఆయుధంతో హత్య చేసి గదికి బయటనుంచి తాళం వేసి పారిపోయారు. ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వీడియో జర్నలిస్టు ఆత్మహత్య

సంగారెడ్డి క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఓ వీడియో జర్నలిస్టు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వీడియో జర్నలిస్టు శ్రీనివాస్ (42) ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో 20 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో శవమై గుర్తు పట్టని విధంగా కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయగా మృతుని జేబులో టీవీ జర్నలిస్టు గుర్తింపు కార్డు లభించడంతో శనివారం అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడు శ్రీనివాస్ టీవీ చానళ్లలో వీడియో జర్నలిస్టుగా పనిచేశాడు. శ్రీనివాస్ ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

మాసాయిపేట జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండలంలోని కొప్పులపల్లిలో జరిగింది. వెల్దుర్తి పోలీసుల వివరాల ప్రకారం.. కొప్పులపల్లి గ్రామానికి చెందిన మల్గా శంకర్ (45) తన సమీప బంధువుల దశదినకర్మ కోసం వచ్చాడు. గ్రామంలోని ఊరి చెరువులో స్నానానికి వెళ్లి అందులో మునిగి మృతి చెందాడు. శంకర్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ..

మద్దూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పక్షవాతంతో బాధపడుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్యానాయక్ తండాకు చెందిన జాటోతు చందు (50) ఆరోగ్యం క్షీణించి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పక్షవాతంతో బాధపడుతూ మనోవేదనకు గురైన చందు ఇటీవల పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. నాలుగురోజులుగా చికిత్స పొందుతు న్నప్పటికీ కోలుకోకపోవడంతో కన్నుమూశాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం



శంకర్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి అప్పుల బాధతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని నవోదయకాలనీకి చెందిన మేకల శంకర్ (35) రామచంద్రపురంలోని రిలయన్స్ డిజిటల్‌లో ప్రమోటర్‌గా పని చేస్తున్నాడు. వచ్చిన జీతండబ్బులతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అందులో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో అప్పుల బాధ ఎక్కువ కావడంతో ఈనెల 1న విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అతడి కోసం అన్ని చోట్ల వెతికారు. ఫోన్ స్విచాఫ్ చేశాడని, ఆచూకీ తెలియకపోవడంతో మేకల శంకర్ భార్య మాధవి శనివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఊరంటే.. ఊరుకాదు..


నాగిరెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు

పల్లె అంటే పచ్చని పొలాలు.. పైర గాలి, చిన్నచిన్న గుడిసెలు.. ఇదంతా గతం.. పల్లెల రూపు మారుతోంది. పల్లెలూ ఆధునికతను సంతరించుకుంటున్నాయి. ఒకనాడు మారుమూల ప్రాంతాలుగా భావించిన కొన్ని పల్లెలను చూస్తే ఔరా అనిపించక మానవు. ఒక మాటలో చెప్పాలంటే సంగారెడ్డి జిల్లాలోని రెండు గ్రామాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ గ్రామాల్లోని జనాభా, ఇళ్లు వంద ల్లోనే ఉన్నాయి. కానీ, విలాసవంతమైన భవనాలు, అంతకంటే అందమైన రోడ్లు, మౌలిక సదుపాయాలతో లగ్జరీ విలేజెస్‌గా పేరు తెచ్చుకున్నాయి.

నగరాన్ని తలపించే లగ్జరీ విలేజెస్

విలాసవంతమైన భవనాలు.. అందమైన రోడ్లు

మౌలిక సదుపాయాలూ అదుర్స్

పచ్చదనం–పరిశుభ్రతలోనూ మేటి

అన్నింటా ఆదర్శం రామిరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం

గుమ్మడిదల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని రామిరెడ్డి బావి, నాగిరెడ్డిగూడెం గ్రామాలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాగిరెడ్డిగూడెంలో 300 జనాభా ఉండగా, 200 ఇళ్లు ఉన్నాయి. రామిరెడ్డిబావి గ్రామంలో 200 జనాభా, వంద ఇళ్లు ఉంటాయి. ఈ రెండు గ్రామాల ప్రజలు కేవలం వ్యవసాయాన్ని నమ్ముకుని ఆదర్శంగా నిలిచారు. ధాన్యం, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ తమ పిల్లలను చదివించుకున్నారు. ఇక్కడి రైతుల పిల్లల్లో కొందరు ఉద్యోగాల్లో, మరికొందరు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. అయితే, ఆ గ్రామాల్లోని ఇళ్లను చూస్తే మెట్రో పాలిటన్ సిటీస్‌లో ఓ నిపుణుడైన ఇంజనీర్ తీర్చిదిద్దినట్లు కనిపిస్తాయి. అందమైన భవంతులు నిర్మించుకోవడమే కాకుండా లోపల బెడ్‌రూం, హాల్, మోడ్రన్ కిచెన్లు కనిపిస్తాయి. ఇక ప్రతీ ఇంటి ముందు కారు కూడా కనిపిస్తుంది. ఇంట్లో ఆధునిక టీవీలు, ఇంటర్నెట్ సదుపాయం సరేసరి. గ్రామాల సమీపంలో ఫామ్‌హౌస్‌లు కూడా కట్టడంతో వారాంతాల్లో పట్టణాల నుంచి ఇక్కడ సేద తీరేందుకు వస్తుంటారు.

నిధులు సద్వినియోగం..

ఈ రెండు గ్రామాల ప్రజలు సమష్టిగా ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించుకున్నారు. వాడవాడలా సీసీ రోడ్లు, మురికి కాలువలు కట్టుకున్నారు. పెద్ద ఎత్తున చెట్లను పెంచడంతో ఆ గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరుస్తోంది. తాగునీటి సదుపాయాన్నీ కల్పించుకున్నారు.

పల్లె సంస్కృతికి పెద్దపీట

ఈ రెండు గ్రామాలు ఎంత ఆధునికత సంతరించుకున్నా.. పల్లె సంస్కృతినీ వీడలేదు. సంక్రాంతి, దసరా, బతుకమ్మ వంటి పండుగలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. నేటి తరానికి ఆచారాలు, సంప్రదాయాలను బోధిస్తుంటారు. దీంతో ఆ గ్రామాలు ఆధునిక, సంప్రదాయ కలయికగా కనిపిస్తాయి.

బ్యాక్ టు విలేజ్

ఒకప్పుడు పల్లెటూరు అబ్బాయికి పెళ్లి సంబంధం కుదరం కష్టంగా ఉండేది. కానీ, మారిన పరిస్థితుల్లో ఈ రెండు గ్రామాల వారికి అమ్మాయిలను ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే, ఇక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక వర్క్ ఫ్రం హోం కూడా కలిసి రావడంతో పలువురు యువత ఇక్కడి నుంచే పని చేస్తూ, మరో పక్క వ్యవసాయం చేస్తూ నూతన జీవన విధానాన్ని అలవర్చుకుంటున్నారు.


గ్రామంలో నిర్మించిన పెద్ద పెద్ద భవనాలు

పట్టణాల్లో ఉంటున్నట్లే ఉంది..



ఒకప్పుడు పెంకుటిళ్లతో ఉండే మా ఊరు అభివృద్ధి చెంది, విశాల భవనాలు, అందమైన రోడ్లతో పట్టణాలను తలపించే విధంగా మారింది. ఇక్కడ నివసిస్తున్నా.. పట్టణంలో ఉన్నట్లే ఉంటుంది.

- పట్నం సావిత్రమ్మ, రాంరెడ్డిబావి

వ్యవసాయమే ఆధారం..



తమ గ్రామానికి వ్యవసాయమే ప్రధాన ఆధారం. వ్యవసాయంతోనే గ్రామంలో అందమైన భవనాలు, విశాలమైన రోడ్లు నిర్మించుకోగలిగాం. ఇప్పుడు మా ఊరు పచ్చదనం పరచుకుంది. అంతా ఆరోగ్యంగా ఉంటున్నాం.

- మల్లారెడ్డి, రామిరెడ్డిపల్లి

అందరి కృషితో గ్రామాల అభివృద్ధి

గ్రామంలో నివసించే అందరం సమష్టి కృషితో ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకున్నాం. పట్టణాలను తలపించేలా మారిన మా గ్రామాలు ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉంది.

- వాసవి రెడ్డి, మాజీ సర్పంచ్, రామ్‌రెడ్డిబావి



అందమైన డిజైన్ తో ఏర్పాటు చేసుకున్న హాల్, కిచెన్


పచ్చని చెట్ల తోరణంతో స్వాగతం పలుకుతున్న నాగిరెడ్డిగూడెం ప్రధాన రహదారి

ఆదర్శనీయుడు బాబు జగ్జీవన్ రామ్

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ

కొండపాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని శనివారం రాత్రి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బాకీ ప్రభాకర్, కళాకారులు దరువు ఎల్లన్న, దరువు అంజన్న, మాజీ సర్పంచ్ మహాదేవ్, వివిధ పార్టీల నాయకులు లింగారావు, మంచాల శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట

● మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మెదక్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతోనే వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయగలమని, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని 22వ వార్డు పరిధిలో మున్సిపల్ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా మురికి కాల్వలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వందరోజుల పాటు యాక్షన్ ప్లాన్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం డంపు యార్డు, డీఆర్‌సీసీ సెంటర్లను సందర్శించారు. అలాగే ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సీడీఎంఏ కార్యాలయ ఏడీ సాయికుమార్, మేనేజర్ భవానీ, ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల దారి కోసం రైతుల రాస్తారోకో



చేగుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పొలాలకు దారి ఇప్పించాలని చేగుంట, అనంతసాగర్ గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు చేగుంట బోనాల రోడ్డుపై శనివారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ గ్రామాల శివారులోని జీవిక పరిశ్రమ చుట్టూ రైతుల పొలాలు ఉన్నాయి. పరిశ్రమ యాజమాన్యం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతున్నది. దీంతో ప్రహరీ నిర్మాణాన్ని నిలిపివేయించి దారి ఇప్పించాలని కోరుతూ రైతులు రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా కళాసాగర్



కంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా కళాసాగర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ ఖైదీల వ్యవసాయ క్షేత్రం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు జైలు పర్యవేక్షణ అధికారిగా పనిచేసిన సంతోష్‌కుమార్‌రాయ్ హైదరాబాద్‌లోని హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కళాసాగర్ సెంట్రల్ జైలు లోపల ఉన్న స్టీల్, ఫినాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించారు.

హైవే ఆక్రమణల తొలగింపు

● పీడీ ఆగ్రహంతో కదలిన జీఎంఆర్



హైవే సర్వీసు రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

తూప్రాన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హైవే పొడవునా ఆక్రమణలపై జీఎంఆర్ సిబ్బంది కొరడా ఝులిపించారు. మే 29న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'హైవే ఆక్రమణలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి కామారెడ్డి జిల్లా అడ్లూరి ఎల్లారెడ్డి వరకు హైవే రోడ్డును ప్రాజెక్టు మేనేజర్ ఉపేందర్, మేనేజర్ రాజేందర్, ఇండిపెండెంట్ ఇంజనీర్ రాజు, ఇతర సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో సర్వీసు రోడ్డు ఆక్రమణ చేసి మట్టి పోయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ జీఎంఆర్ సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే నోటీసులు జారీ చేసి, ఆక్రమణలు తొలగించాలని మేనేజర్లను ఆదేశించారు. ఈ మేరకు జీఎంఆర్ సంస్థ ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టింది. శనివారం తూప్రాన్ హైవే బైపాస్‌లో కొత్త చెరువు వద్ద హైవే సర్వీసు రోడ్డు ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. హైవే ఇరువైపులా ఉన్న అనుమతులులేని ఆక్రమణలు పూర్తిగా తొలగిస్తామని వారు తెలిపారు.

యువశక్తి మీదనే దేశ ప్రగతి ఆధారపడి ఉంది

● ఎంపీ రఘునందన్ రావు

● బీజేపీలో భారీగా చేరికలు


పెద్ద గొట్టిముక్కలో ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

శివ్వంపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : యువశక్తి మీదనే దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో ఎంపీ సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. పెద్దగొట్టి ముక్ల, బోజ్యతండా, శభాష్ పల్లికి చెందిన గ్రామలకు చెందిన యువకులకు ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎంపీకి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఘన స్వాగతం పలికారు. ముందుగా బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎంపీగా తన గెలుపునకు కృషి చేసిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. పెద్దగొట్టిముక్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. స్కూల్ ప్రహరీ నిర్మాణానికి, సోలార్ లైట్ల కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం రాలేదని మహిళలు ఎంపీ దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడుతానన్నారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు కొండల్‌రావు మండల అధ్యక్షుడు రవి, భిక్షపతి, అంజిగౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శివ్వంపేటలో తపాలా కార్యాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని మండల నాయకులు ఎంపీని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసులకు ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో కీలకం : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో కీలకమని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డిలోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సివిల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బందికి డీఎస్పీ నరేందర్ ఆధ్వర్యంలో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు. ఫిట్నెస్‌ను కాపాడుకోవడానికి ప్రతీరోజు వ్యాయామం, యోగా చేయాలన్నారు. వీఐపీ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేసులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిఘా పెంచాలన్నారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో కలిగే నష్టం, అనర్థలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు రామారావు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన హనుమాన్ ఆలయం


కొండాపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో బారులు తీరిన భక్తులు

నారాయణఖేడ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని శనివారం మండలం పరిధి కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు భక్తుల సౌజన్యంతో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం భక్తులకు ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే ఖేడ్ పట్టణం, పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో సైతం భక్తుల రద్దీ నెలకొన్నది.

ఓడీఎఫ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

● జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్


ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగ సంఘాల నాయకులతో జటోత్ హుస్సేన్

కంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఓడీఎఫ్ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడతానని, ప్రమోషన్లకు అడ్డంకులను తొలగిస్తానని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో యుద్ధ ట్యాంకర్ వాహనంపై పర్యటించారు. అనంతరం ఆయుధ కర్మాగార ఆవరణ మొత్తం పరిశీలించి ఆరు గంటల పాటు ఓపికగా ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి ఉద్యోగ సంఘాల నాయకులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్లు కళ్యాణ్‌రెడ్డి, అశోక్, కిరణ్, ఆలిండియా నాయకులు పీవీ రమణ, తావరియా నాయక్, దశరథ్, హరినాయక్, రాజు, నేనావత్ హిరాసింగ్, రవీందర్ రాథోడ్, యూనిట్ లెవెల్ ఎస్టీ ప్రెసిడెంట్ గోవర్ధన్, జనరల్ సెక్రటరీ మోహన్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు

ఎవరెస్ట్‌ను అధిరోహించిన విద్యార్థికి మంత్రి అభినందన



సంగారెడ్డి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ గురుకుల బాలురు పాఠశాల(సదాశివపేట)కు చెందిన 9 వ తరగతి విద్యార్థి ఆర్.రాహుల్ నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించారు. గత నెల 25 న మొదలైన సాహస యాత్ర ఈ నెల 9 వ తేదీ వరకు కొనసాగింది. 5364 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంపునకు ఈ నెల 4న చేరుకున్నారు. రాష్ట్రంలోని 20 మంది విద్యార్థులు ట్రెక్కింగ్ చేయగా అందులో రాహుల్ ఒకరు. ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన రాహుల్‌ను ప్రిన్సిపాల్ బి.సంతోషి, పీఈటీ ఎస్.ఉపేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజేపీ సొసైటీ సెక్రటరీ సైదులు, ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డిలు సైతం రాహుల్‌ను అభినందిస్తూ సన్మానించారు.

పుష్కరకాలమైనా పనులు పూర్తి కావా?

- అర్ధాంతరంగా ఆగిన పంచాయతీ భవన నిర్మాణాలు
- నిధుల లేమితో పూర్తికాని పనులు
- పాత భవనాలు శిథిలావస్థకు..
- కుల సంఘాల భవనాల్లో కొనసాగుతున్న వైనం
- గ్రామ సభలు, సమావేశాల కోసం ప్రత్యామ్నాయ స్థలాలను వెతకాల్సిందే
- పట్టించుకోని అధికారులు


గౌరాయిపల్లిలో అసంపూర్తిగా పంచాయతీ భవనం


తపాస్‌పల్లిలోని ముదిరాజ్ సంఘం భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం


తపాస్‌పల్లిలో శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనం

కొమురవెల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని గౌరాయిపల్లి, తపాస్‌పల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో దాదాపు పదేళ్ల క్రితం నూతన పంచాయతీ భవనాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా, నిర్మాణాలు ప్రారంభించిన కాంట్రాక్టర్లు స్లాబ్‌లు వేసి బిల్లులు మంజూరు కాలేదని, నిర్మాణానికి మంజూరైన డబ్బులు సరిపోవు.. అదనపు నిధులను మంజూరు చేయాలంటూ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అదనపు నిధుల కోసం పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించి పంచాయతీ భవనాలను పూర్తి చేయించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి ప్రారంభించిన పంచాయతీ భవనాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో పుష్కరకాలమైనా జీపీ కార్యాలయాల పనులు పూర్తి కావా అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కుల సంఘాల భవనాల్లో..

శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ భవనాల స్థానంలో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలను ప్రారంభించడంతో తాత్కాలికంగా గ్రామంలో ఉన్న కుల సంఘాల భవనంలో గ్రామ పంచాయతీల కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అయితే ఏళ్లు గడిచినా నూతన పంచాయతీ భవనాలు పూర్తి కాకపోవడంతో అరకొర వసతుల నడుమ గ్రామ పంచాయతీల కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోని పలు రికార్డు పుస్తకాలను, కంప్యూటర్లను, ఇతర విలువైన సామగ్రిని కాపాడటం పంచాయతీ కార్యదర్శులకు తలకుమించిన భారంగా మారింది.

గ్రామసభలు నిర్వహించలేని పరిస్థితి

గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా సాధారణంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దే నిర్వహిస్తారన్న విషయం విదితమే. కానీ గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించాలంటే ఇప్పుడున్న భవనాల్లో సాధ్యం కాకపోవడంతో ప్రతిసారీ ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సి వస్తుంది. ఎక్కడ నిర్వహిస్తున్నామో ప్రతిసారీ ప్రజలకు సమాచారమివ్వాల్సిన పరిస్థితి నెలకొన్నది.

అదనపు నిధులు రాగానే పనులు పూర్తిచేస్తాం

గతంలో గ్రామ పంచాయతీ నూతన భవనాలను మంజూరు చేసినప్పుడు అప్పుడున్న పరిస్థితిని బట్టి తక్కువ నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు మంజూరైన బిల్లుల వరకు నిర్మాణాలు చేశారు. ఇప్పుడు నిర్మాణానికి కావాల్సిన ముడి సరుకుల ధరలు పెరగడంతో అదనపు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అదనపు నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తాము

-డి.శివకుమార్, పీఆర్ఏఈ కొమురవెల్లి

గెస్ట్ టీచర్ దరఖాస్తుల గడువు పెంపు

రాయపోల్, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు మంజూరైన ఒకేషనల్ కోర్సులను బోధించడానికి గెస్ట్ టీచర్ల నియామకం కోసం దరఖాస్తుల గడువును పెంచినట్లు ఎంఈవో సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ నెల 16 లోపు అర్హులైన అభ్యర్థులు రాయపోల్ కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ బోధించడానికి ఎంఏస్సీ (ఇంగ్లిష్), బీఈడీ చేసిన వారు అర్హులని తెలిపారు. అలాగే ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును బోధించడానికి బీఎస్సీ నర్సింగ్ చేసినవారు అర్హులన్నారు. ఎమ్ఎల్‌టీ విద్యార్థులకు బోధించడానికి ఎంఎస్సీ(మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ జెనెటిక్) లేదా బీఫార్మసీ, లేదా ఎమ్మెల్సీ(ఎమ్మెల్టీ)లేదా ఎంబీబీఎస్(హెచ్ఏఎం), బీహెచ్ఎఫ్ఎస్ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

సిద్దిపేట అభివృద్ధిని మేమూ అమలు చేస్తాం


సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన రామ్‌దుర్గ్ కౌన్సిల్ బృందం

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 14: సిద్దిపేటలో చేసిన అభివృద్ధిని చూసి చాలా నేర్చుకున్నామని, ఇక్కడ చేసిన అభివృద్ధిని మేము కూడా అమలు చేస్తామని కర్ణాటక రాష్ట్రం, బెల్గావ్ జిల్లాలోని రామ్‌దుర్గ్ కౌన్సిల్ అధ్యక్షురాలు లక్ష్మిజగదీశ్, సభ్యులు స్పష్టం చేశారు. శనివారం సిద్దిపేట పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కర్ణాటక రాష్ట్రం బెల్గావ్ జిల్లాలోని రామ్‌దుర్గ్ కౌన్సిల్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు స్వచ్ఛబడిని సందర్శించి అక్కడ సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం స్వచ్ఛబడిలో చేపడుతున్న పలు కార్యక్రమాలను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం బుస్సాపూర్‌లోని బయోగ్యాస్ ప్లాంటును సందర్శించి చెత్తనుంచి వెలువడుతున్న బయోగ్యాస్ ఉత్పత్తి విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ డీఈ ప్రేరణ, బృందం ఉపాధ్యక్షుడు సరితగోవిందాలాల్, సభ్యులు నాగరాజ్‌సిద్దప్ప, సంగీత, మాబుసబ్, సునీతారాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు


హుస్నాబాద్‌లో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హుస్నాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ ఆలయంలో నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గీత పారిశ్రామిక సంఘం సొసైటీ అధ్యక్షుడు పూదరి వరప్రసాద్, పూదరి లక్ష్మీనారాయణ, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్, నాయకులు పెరుమాండ్ల శ్రీనివాస్, కక్కెర్ల రవీందర్, నర్సాగౌడ్, శ్రీకాంత్, చంద్రమౌళి, పూదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నేతలు


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి/గజ్వేల్ జూన్ 13: జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ కాంగ్రెస్ నేతలు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఉన్నారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ త్వరలోనే సిద్దిపేటలో నామినేట్ పదవులు భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించినట్లు చెప్పారు. మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేట పట్టణ అధ్యక్షుడిని చూసి అత్తుఇమామ్ ఎలా ఉన్నావంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్నవారికే మొదటి ప్రాధాన్యతగా పదవులు కట్టబెడతామని హామీ ఇచ్చారని తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుతో సీఎం గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు.

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుదిశగా నడిపించాలని సీఎం తనకు సూచించినట్లు బండారు శ్రీకాంత్‌రావు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ బోధన

దౌల్తాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొంది ఉత్తమ ఫలితాలు సాధించాలని దౌల్తాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పరపల్లి, కోనాయిపల్లి, గువ్వలేగి, పోసాన్‌పల్లి, బోనాల తదితర గ్రామాల్లో దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం పర్యటించి విద్యార్థులతో పాటు వారి తల్లి దండ్రులకు కళాశాలలో చేరడం వల్ల పొందే ప్రయోజనాలను వివరించారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం మంగ్యనాయక్, సుధాకర్, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాపురెడ్డి



సిద్దిపేట రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాపురెడ్డి శనివారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ సమన్వయంతో శంకర్ నేత్రాలయ ఆసుపత్రి హైదరాబాద్ వారిచే ఉచిత కంటి స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్యాంపులో ఆపరేషన్ అవసరమున్న వారిని గుర్తించి అదేరోజు హైదరాబాద్ శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి పంపిస్తారని వివరించారు. రాఘవాపూర్ గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బాపురెడ్డి కోరారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమురవెల్లి/రాయపోల్/మద్దూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొమురవెల్లి, రాయపోల్, మద్దూరు, దూళిమిట్ట మండలాల ఎంఈవోలు బొమ్మగోని రమేష్, సత్యనాయణరెడ్డి, వరదరాజు, మీనాంజనేయులు శనివారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు 1 సెప్టెంబరు 2016 నుంచి 31 ఆగస్టు 2017 మధ్యన జన్మించినవారు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఈ నెల 18వ తేదీన ఆయా మండల కేంద్రాల్లో నిర్దేశించిన పాఠశాలల్లో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో ఈ నెల 24న, రాష్ట్ర స్థాయిలో వచ్చే నెల 1నుంచి 5వ తేదీ వరకు జరిగే క్రీడా పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు క్రీడా పాఠశాలల్లో ప్రవేశం లభిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం రాయపోల్ మండలానికి చెందిన విద్యార్థులు 9866504089 నంబర్‌కు, మద్దూరు దూళిమిట్ట మండలాలకు చెందిన విద్యార్థులు 7893597519 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే రేవంత్ యత్నం


గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాను ఎగొట్టేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీల ఎగవేతలలో అసత్యపు ప్రచారాలలో రేవంత్‌రెడ్డి ముందు వరుసలో ఉంటారన్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులున్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

కొడిపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండల పరిధిలోని కూకట్లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు చెట్లను నరికి సాగు చేసేందుకు భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి క్షేత్ర కార్యాలయంలో ఉంచారు. మండల ఎఫ్ఆర్‌వోను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

నాగల్‌గిద్ద, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బైక్ బోల్తాపడి యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పూసల్‌పాడ్ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. నాగల్‌గిద్ద మండల కేంద్రానికి చెందిన సంజీవ్(35) పని నిమిత్తం బైక్‌పై నారాయణఖేడ్‌కు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. పూసల్‌పాడ్ శివారుకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న ఎంపీ సురేష్ కుమార్ తన కారు ఆపి సంజీవ్‌ను హాస్పిటల్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు.

రైతు భరోసా ఇంకెప్పుడిస్తారు?

సంగారెడ్డి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైంది. రైతులకు రైతుభరోసా ఇంకెప్పుడు ఇస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పూర్తిగా విఫలమైందన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

సంగారెడ్డి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు రెవెన్యూ కాలనీలలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ఆలయంలో పులిహోర ప్రసాదాన్ని ప్లాస్టిక్ వస్తువుల్లో కాకుండా పేపర్ ప్లేట్లలో అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 29 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 29 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం రూ.25,500 జరిమానా విధించారు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతలు

సిద్దిపేట అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 63 మంది రక్తదానం చేశారు. రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టవచ్చని హాస్పిటల్, మెడికల్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ కరుణాకర్, డాక్టర్ శ్రీధర్, ఉమా, మౌనిక, వెంకటరమణారెడ్డి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజేందర్, పీఆర్‌వో పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, ఈ విషయంలో కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు పేర్కొన్నారు. శనివారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తీస్తే కేటీఆర్ ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలు, మద్దెల స్వామి, కర్ణల శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, ఆంజనేయులు, సంపత్‌రెడ్డి, పడాల మల్లేశం, బ్యాగరి రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

17న మెదక్‌లో బీసీల రౌండ్‌టేబుల్ సమావేశం

- ముఖ్య అతిథిగా రానున్న ఎమ్మెల్సీ కవిత


గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో కొట్టాల యాదగిరి

గజ్వేల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన యునైటెడ్ ఫూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నేతృత్వంలో మెదక్ పట్టణంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత హాజరుకానున్నారని తెలిపారు. పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ లబ్ధి పొందుతుండగా. జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీలకు 37 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింపజేసినట్లు గుర్తు చేశారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఫూలేఫ్రంట్ నేతలు విజయేంద్రసాగర్, గోపు సదానంద్, కుమారస్వామి, నరసింహ, వంశరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని పూజలు


లద్నూరులోని హనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

మద్దూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని శనివారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో లద్నూరులోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, మాజీ కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ కనకరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించండి

సంగారెడ్డి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు పదోన్నతులకు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 700 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూళ్లలో కూడా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. అదేవిధంగా డీఈవో, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పదోన్నతులు నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, ఉపాధ్యక్షులు కాశీనాథ్, సువర్ణ, కార్యదర్శులు అరుణశ్రీ, షామయ్య, జగన్‌మోహన్, సాయితేజ, అనురాధ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

పాపన్నపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ హిందువు కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం అన్నారు. శనివారం ఏడుపాయల వద్ద విశ్వ హిందూపరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి భావం పెంపొందించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. హిందువులు ఐకమత్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా భజరంగ్‌దళ్ విద్యార్థి ప్రముఖ్‌గా బోల కృష్ణను, పాపన్నపేట మండల ప్రఖండ ప్రముఖ్‌గా మల్లేశంను నియమించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, మెదక్ సంఘటన కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి నీలశ్యాం, భజరంగ్ దళ్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.